వాడుకొని వదిలేస్తే జైలుకే

- శారీరకంగా కలిసి మొహం చాటేస్తే పదేండ్ల జైలు
- చర్చనీయాంశంగా మారిన బీఎన్ఎస్ సెక్షన్ 69
- ఆందోళన వ్యక్తం చేస్తున్న న్యాయ నిపుణులు
- పురుషులు ఇబ్బందులు పడతారని అభిప్రాయం

న్యూఢిల్లీ, జూలై 3: ఇండియన్ పీనల్ కోడ్‌కు బదులు కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహితలోని ఒక సెక్షన్ పట్ల న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఎన్ఎస్‌లోని సెక్షన్ 69 ప్రకారం.. స్త్రీ, పురుషుల మధ్య సంబంధం విఫలమైనప్పుడు(బ్రేకప్ జరిగినప్పుడు) పురుషుడు వేధింపులకు గురయ్యే అవకాశం ఉందని, పదేండ్ల పాటు జైలులో ఉండాల్సిన పరిస్థితి కూడా రావొచ్చని చెప్తున్నారు. మహిళ కనుక తన వద్ద నిజాలు దాచి లేదా పెండ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా కలిసి, ఇప్పుడు మోసం చేశాడని ఫిర్యాదు చేస్తే ఈ సెక్షన్ కింద పురుషుడిపై కేసు నమోదు చేయవచ్చు. నేరం రుజువైతే పురుషుడిపై పదేండ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించవచ్చు.

ఏమిటీ సెక్షన్ 69 ?
మహిళలు, పిల్లలపై నేరాల నియంత్రణకు ఉద్దేశించిన బీఎన్ఎస్‌లోని చాప్టర్ 5లో సెక్షన్ 69 ఉంది. మోసపూరిత వాగ్దానాల ద్వారా లేదా నెరవేర్చే ఉద్దేశం లేనప్పటికీ పెండ్లి చేసుకుంటానని చెప్పి మహిళతో శారీరకంగా కలిస్తే పదేండ్ల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చని ఈ సెక్షన్ చెప్తున్నది.

గతంలో ఏ శిక్ష ?
నిజాలు దాచిపెట్టి లేదా మోసం చేసి శారీరకంగా కలిశాడనే ఫిర్యాదుకు సంబంధించి చర్యలు తీసుకునేందుకు ఇంతకుముందు ఐపీసీలో నిర్దిష్టమైన సెక్షన్ అంటూ ఉండేది కాదు. అయితే, 'అవాస్తవాల ద్వారా పొందిన సమ్మతి చెల్లదు' అని చెప్పే సెక్షన్ 90 కింద కేసు నమోదు చేసేవారు. ఆ తర్వాత మహిళ తనపై అత్యాచారం చేశాడనే ఫిర్యాదు చేస్తే సెక్షన్ 375 కింద అత్యాచార కేసు కూడా నమోదు అయ్యేది.

సెక్షన్ 69పై ఎందుకు ఆందోళన ?
ఈ సెక్షన్ ద్వారా ఇద్దరి సమ్మతి లేకుండా బ్రేకప్ జరిగినప్పుడు, రిలేషన్‌షిప్ కనుక పెండ్లి వరకు వెళ్లనప్పుడు కొన్నిసార్లు పురుషుడు వేధింపులకు గురయ్యే ప్రమాదం ఉంటుందని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఇతర కారణాల వల్ల బ్రేకప్ జరిగినప్పటికీ మహిళ ఫిర్యాదు చేస్తే పురుషుడు ఈ సెక్షన్ కింద నేరారోపణలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఫిర్యాదు చేయగానే పురుషుడిని పోలీసులు అరెస్టు చేస్తారు. నిజాలు తర్వాత విచారణలో తేలుతాయని చెప్తున్నారు.

జార్ఖండ్ సీఎంగా

మళ్లీ హేమంత్ సొరేన్

- చంపయీ సొరేన్ రాజీనామా
- శాసనసభాపక్ష నేతగా హేమంత్‌ను ఎన్నుకున్న జేఎంఎం ఎమ్మెల్యేలు
- త్వరలోనే ప్రమాణ స్వీకారం
- హేమంత్ బెయిల్‌పై సుప్రీంకు ఈడీ!

గవర్నర్‌కు రాజీనామా పత్రం అందజేస్తున్న చంపయీ సొరేన్, చిత్రంలో హేమంత్

రాంచి, జూలై 3: జార్ఖండ్ ముఖ్యమంత్రిగా మరోసారి హేమంత్ సొరేన్ బాధ్యతలు చేపట్టనున్నారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన హేమంత్ సొరేన్ జూన్ 28న బెయిల్‌పై బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో బుధవారం జేఎంఎం నేతృత్వంలోని కూటమి ఎమ్మెల్యేలు సమావేశమై హేమంత్‌ను శాసన సభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడం లాంఛనం అయ్యింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆహ్వానించాల్సిందిగా హేమంత్ సొరేన్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కోరారు. త్వరలోనే ఆయన ప్రమాణస్వీకారం ఉండనుంది. దీంతో జార్ఖండ్ 13వ ముఖ్యమంత్రిగా హేమంత్ సొరేన్ బాధ్యతలు చేపట్టనున్నారు.

చంపయీ సొరేన్ రాజీనామా
తన అరెస్టు ఖాయం కావడంతో జనవరి 31న హేమంత్ సొరేన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఫిబ్రవరి 2న జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) సీనియర్ నేత చంపయీ సొరేన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. హేమంత్ మరోసారి ముఖ్యమంత్రి కాబోతుండటంతో బుధవారం చంపయీ సొరేన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని సమర్పించారు. జేఎంఎం నేతృత్వంలోని కూటమి నిర్ణయం మేరకు రాజీనామా చేసినట్టు ఆయన ప్రకటించారు.

సుప్రీంకోర్టుకు ఈడీ!
హేమంత్ సొరేన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ జార్ఖండ్ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును త్వరలో సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వర్గాలు తెలిపాయి. ఈ మేరకు త్వరలోనే స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు తెలుస్తున్నది. ఇదే జరిగితే సుప్రీంకోర్టు తీర్పుపై జార్ఖండ్ రాజకీయాలు ఆధారపడే అవకాశం ఉంది. కాగా, హేమంత్ సొరేన్ నేరం చేశారని నమ్మడానికి ఆధారాలు కనిపించడం లేదని జార్ఖండ్ హైకోర్టు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

బీహార్‌లో ఒకేరోజు కూలిన మూడు బ్రిడ్జిలు

పాట్నా: బీజేపీ, జేడీయూ పాలిత బీహార్‌లో వరుసగా వంతెనలు కూలిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నది. బుధవారం మూడు వంతెనలు/కాజ్‌వేలు కూలిపోయాయి. దీంతో గడచిన 15 రోజుల్లో కూలిన వంతెనల సంఖ్య 9కి చేరింది. ఈ నేపథ్యంలో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ స్పందిస్తూ, రాష్ట్రంలోని అన్ని పాత వంతెనలను అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే మరమ్మతులు జరపవలసిన వంతెనలను గుర్తించాలని చెప్పారు.

కేంద్ర క్యాబినెట్ కమిటీల ఏర్పాటు

తెలుగు మంత్రులిద్దరికి చోటు

న్యూఢిల్లీ, జూలై 3: పలు క్యాబినెట్ కమిటీలు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. ఆర్థిక, రక్షణ, రాజకీయ వ్యవహారాలలో దేశ అత్యున్నత నిర్ణయాధికారులు సహా వివిధ క్యాబినెట్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు అధికార నోటిఫికేషన్‌ను జారీ చేశారు. నియామకాల క్యాబినెట్ కమిటీలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా ఉంటారు. అలాగే భద్రతా వ్యవహారాల కమిటీలో ప్రధాని మోదీ సహా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఉంటారు. కేంద్ర క్యాబినెట్ కమిటీ సభ్యులుగా తెలుగు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, కింజారపు రామ్మోహన్ నాయుడులకు స్థానం దక్కింది. పార్లమెంటరీ, రాజకీయ వ్యవహారాల కమిటీలలో రామ్మోహన్ నాయుడుకు చోటు దక్కగా, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులుగా రామ్మోహన్ నాయుడుతోపాటు కిషన్ రెడ్డికి స్థానం లభించింది.

---

132 సీట్లు.. బస్ హోస్టెస్!

- విమానం తరహాలో బస్సులో సేవలు
- నాగపూర్‌లో పైలట్ ప్రాజెక్టు: గడ్కరీ

న్యూఢిల్లీ, జూలై 3: విమానం తరహాలో అధిక సంఖ్యలో 132 మంది ప్రయాణికులు కూర్చొనేలా సీటింగ్ సదుపాయంతో కూడిన ఎలక్ట్రిక్ బస్సు పైలట్ ప్రాజెక్టు మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరుగుతున్నదని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం వెల్లడించారు. విమానంలో ఎయిర్ హోస్టెస్ ఉన్న విధంగానే ఇందులోనూ 'బస్ హోస్టెస్' ఉంటారని ఆయన తెలిపారు. టాటా సంస్థతో కలిసి ఈ పైలట్ ప్రాజెక్టు కొనసాగుతున్నదని, ఈ బస్సు ప్రతి 40 కిలోమీటర్లకు ఒకసారి కేవలం 40 సెకండ్లలో రీచార్జి చేసుకొంటుందని తెలిపారు. కిలోమీటర్ దూరానికి రూ.35-40 వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ కొత్త తరహా బస్సు ధర విషయంలో కూడా డీజిల్ బస్సుల కంటే తక్కువగానే ఉండే అవకాశం ఉందని చెప్పారు.

జైలుకెళ్లి.. బాబాగా మారి

- ఐదు లైంగిక దాడి కేసుల్లో నిందితుడు
- ఓ కేసులో కొన్నాళ్ల పాటు జైలు జీవితం
- 18 ఏండ్లపాటు పోలీసు శాఖలో ఉద్యోగం
- వీఆర్ఎస్ తీసుకొని బాబాగా అవతారం
- 'భోలే బాబా' అసలు బాగోతం ఇదీ

లక్నో, జూలై 3: తనకు తాను భగవంతుడి ప్రతిరూపంగా ప్రచారం చేసుకుంటూ అమాయక జనం ప్రాణాలను పొట్టన పెట్టుకున్న 'భోలే బాబా' బాగోతానికి సంబంధించి అసలు నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. జగద్గురు సాకార్ విశ్వహరి భోలే బాబాగా ప్రాచుర్యం పొందిన ఇతడి అసలు పేరు సూరజ్ పాల్. నారాయణ్ సాకార్ హరి, సాకార్ విశ్వ హరి పేర్లతోనూ చలామణి అయ్యేవాడు. యూపీలోని ఎటా జిల్లా బహదూర్ గ్రామానికి చెందిన సూరజ్ పాల్ మొదట తండ్రితో కలిసి వ్యవసాయం చేసేవాడు. తర్వాత పోలీసు శాఖలో ఉద్యోగంలో చేరి 18 ఏండ్ల పాటు పని చేశాడు. ఈ సమయంలోనే తాను ఇంటలిజెన్స్ బ్యూరోలో పని చేస్తున్నట్టు చెప్పుకొని జనాన్ని బురిడీ కొట్టించేవాడు. 1999లో ఉద్యోగం నుంచి బయటకు వచ్చి బాబా అవతారం ఎత్తాడు. అయితే, లైంగిక వేధింపుల కేసులో ఇరుక్కున్నందునే సస్పెండ్ అయ్యాడనే ప్రచారం కూడా జరుగుతున్నది.

ఐదు లైంగిక దాడి కేసుల్లో నిందితుడు
భోలే బాబాపై ఆగ్రా, ఎతావాహ్, కస్‌గంజ్, ఫరూఖాబాద్, దూసా ప్రాంతాల్లో ఐదు లైంగిక దాడి కేసులు నమోదైన విషయం వెలుగులోకి వచ్చింది. 1997లో ఓ కేసులో అరెస్టయి కొన్నాళ్లు జైలు శిక్ష కూడా అనుభవించినట్టు తెలుస్తున్నది. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాతనే తన గ్రామంలో ఓ ఆశ్రమాన్ని ప్రారంభించాడు. తనకు గురువు ఎవరూ లేరని చెప్పుకునే భోలే బాబా.. కాషాయానికి బదులుగా తెల్లటి సూటు, బూట్లు, నల్ల కండ్లద్దాలు ధరిస్తూ ప్రత్యేకంగా కనిపిస్తుంటాడు.

మూఢ నమ్మకాలతో మోసం
తనను నమ్మే వారిని భోలే బాబా అనేక మూఢ నమ్మకాలతో ముంచేశాడని తెలుస్తున్నది. ముఖ్యంగా తాను నిర్వహించే సత్సంగ్‌లలో ఇచ్చే పవిత్ర జలం తాగితే భక్తుల సమస్యలు తీరిపోతాయనే ప్రచారం చేయించాడు. తన పాదధూళి కూడా పవిత్రమైనదని, బాబా నడిచిన నేలపై మట్టిని తాకినా అదృష్టం వరిస్తుందనే నమ్మకాన్ని సృష్టించాడు. ఇవి నమ్మి ఉత్తరప్రదేశ్‌తో పాటు ఉత్తరాఖండ్, హరియాణా, రాజస్థాన్‌తో పాటు ఢిల్లీ నుంచి పెద్ద ఎత్తున జనం భోలే బాబా దర్శనం కోసం వచ్చే వారు.

121కి పెరిగిన మృతుల సంఖ్య
పుల్‌రయిలో మంగళవారం భోలే బాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో మృతుల సంఖ్య 121కు చేరుకుంది. అనేక మంది దవాఖానాల్లో చికిత్స పొందుతున్నారు. ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు.

అమెరికాలోని భారత విద్యార్థుల

ఇంటర్న్‌షిప్ కష్టాలకు చెక్!

ప్రత్యేక ప్లాట్‌ఫామ్ ప్రారంభించిన భారత రాయబార కార్యాలయం

న్యూయార్క్: ఇంటర్న్‌షిప్ విషయంలో అమెరికాలోని భారత విద్యార్థులు పడుతున్న కష్టాలకు చెక్ పెట్టేందుకు న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక ప్లాట్‌ఫామ్ ప్రారంభించింది. దీని ద్వారా అమెరికాలోని కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలతోపాటు న్యాయ, వైద్యపరమైన సమాచారాన్ని కూడా అందించనున్నది. అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాలైన కనెక్టికట్, మైనె, మాసాచుసెట్స్, న్యూహ్యాంప్‌షైర్, న్యూజెర్సీ, న్యూయార్క్, ఒహియో, పెన్సిల్వేనియా, రోడ్ ఐలండ్స్, వెర్మాంట్‌లలో ఈ సేవలు అందిస్తుంది. ఇంటర్న్‌షిప్ విషయంలో అర్హులైన భారతీయ విద్యార్థులను పరిగణనలోకి తీసుకునేందుకు అనేక భారతీయ, అమెరికన్ కంపెనీలు, సంస్థలు అంగీకరించినట్టు భారత కాన్సులేట్ 'ఎక్స్' ద్వారా వెల్లడించింది. విద్యార్థులు నేరుగా ఆయా కంపెనీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పలు కంపెనీలు, బహుళజాతి సంస్థలు, టెక్నాలజీ, ప్రభుత్వ సంస్థలు, ఏవియేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మా, టాటాసన్స్ సహా అనేక రంగాల్లోని కంపెనీలలో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేసుకునే అవకాశాలకు సంబంధించిన జాబితాను పోర్టల్ సిద్ధం చేస్తుంది.

త్రీడీ హోలోగ్రామ్స్‌తో జపాన్ కరెన్సీ

ప్రపంచంలోనే మొదటిసారి.. నకిలీ నోట్ల బెడదకు చెక్

టోక్యో, జూలై 3: నకిలీ నోట్ల బెడదను అరికట్టేందుకు.. సరికొత్త సెక్యూరిటీ ఫీచర్స్‌తో జపాన్ కొత్త కరెన్సీ నోట్లను తీసుకొచ్చింది. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా త్రీడీ హోలోగ్రామ్స్‌తో కరెన్సీ నోట్లను ముద్రించింది. త్రీడీ హోలోగ్రామ్స్ సెక్యూరిటీ ఫీచర్‌తో ఉన్న కొత్తగా ముద్రించిన 10 వేల యెన్, 5 వేల యెన్, 1000 యెన్ నోట్లు జపాన్‌లో బుధవారం నుంచి చలామణిలోకి వచ్చాయి. దేశ సంస్కృతి, శాస్త్రీయతను ప్రభావితం చేసిన చారిత్రక ప్రముఖుల ఫొటోలను హోలోగ్రామ్ చూపింది. 20 ఏండ్ల తర్వాత జపాన్ కొత్త నోట్ల ముద్రణ చేపట్టింది. మారుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా కొత్త నోట్లను తీసుకురావాలని జపాన్ నిర్ణయించింది.

ఇన్సులిన్ ఇక వారానికోసారే!

- మధుమేహులకు గుడ్‌న్యూస్
- రోజూ ఇంజెక్షన్‌కు బైబై
- 7 రోజులకోసారిచ్చే ఇంజెక్షన్ 'ఐకోడెక్' అభివృద్ధి
- అనుమతుల కోసం సీడీఎస్సీవో ముందుకు
- త్వరలో మార్కెట్లోకి వచ్చే ఛాన్స్!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): దేశంలో పది కోట్లమందికి పైగా మధుమేహ వ్యాధితో బాధపడుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడానికి వీళ్లందరూ రోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్‌ను ఇప్పించుకోవాల్సి వస్తున్నది. ఒక్కరోజు మిస్ అయినా.. ప్రాణాపాయం సంభవించే పరిస్థితి. ఇలాంటి సమయంలో మధుమేహ వ్యాధిగ్రస్తులకు డెన్మార్క్‌కు చెందిన ఫార్మా కంపెనీ నోవో నోర్డిస్క్ శుభవార్త చెప్పింది. రోజుకు బదులు వారానికోసారి ఇచ్చే ఇన్సులిన్ ఇంజెక్షన్ 'ఐకోడెక్'ను ఈ సంస్థ అభివృద్ధి చేసింది. ఇప్పటికే యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ (ఈఎంఏ) అనుమతులను పొందిన ఈ ఇంజెక్షన్.. భారత్‌లోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్సీవో) ఆధ్వర్యంలోని సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ కమిటీ (సీఈసీ) పరిశీలనకు వచ్చింది. ఒకవేళ అనుమతులు లభిస్తే, త్వరలోనే భారత మార్కెట్లోకి ఐకోడెక్ వచ్చే అవకాశమున్నది. కాగా స్థూలకాయుల బరువును తగ్గించడంలో సాయపడే ఒజెంప్టిక్ డ్రగ్‌ను కూడా నోవో నోర్డిస్క్ కంపెనీనే తయారు చేయడం గమనార్హం.

ఇంజెక్షన్ పనితీరు ఇలా..
సరిపడినంత ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడం లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్‌ను శరీరం సరిగ్గా వినియోగించుకోకపోవడంతో వరుసగా టైప్-1, టైప్-2 డయాబెటిస్‌లు వస్తాయి. దీన్ని నివారించాలంటే, చక్కెర స్థాయిలను నియంత్రించే ఇన్సులిన్ రోజువారీగా అవసరపడుతుంది. అయితే, ఐకోడెక్ ద్వారా ఇన్సులిన్‌ను వారానికి సరిపడే మోతాదులో ఒకే డోసు ఇంజెక్షన్‌గా తీసుకొంటే సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదమున్నదన్న ప్రశ్నలు తలెత్తాయి. దీనిపై గత ఏడాది జరిగిన ఓ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వివరణ ఇచ్చారు. ఐకోడెక్ ద్వారా వారానికి సరిపడే విధంగా ఇన్సులిన్‌ను ఇచ్చినప్పుడు ఆ ఇన్సులిన్ అంతా రక్తంలోని ఆల్బుమిన్ అనే ప్రొటీన్‌లో ఇన్‌యాక్టివ్ స్టోరేజీలో నిల్వ ఉంటుందని ప్రతినిధులు తెలిపారు. రక్తంలో చక్కెర స్థాయిలు మారినప్పుడు ప్రతీరోజూ కొద్దికొద్దిగా ఇన్సులిన్ వారంపాటు విడుదల అవుతుందని వెల్లడించారు. ఈ ఇంజెక్షన్‌ను చర్మం కింద ఇస్తామని వివరించారు.

బధిరుల కోసం ఇంప్లాంటబుల్ మైక్స్

అభివృద్ధి చేసిన అమెరికా పరిశోధకులు

న్యూయార్క్, జూలై 3: వినికిడిలోపం ఉన్న వారికి శుభవార్త చెప్పారు అమెరికాకు చెందిన పరిశోధకులు. పూర్తిగా చెవి లోపల అమర్చ గలిగే మైక్రోఫోన్‌ను హార్వర్డ్ మెడికల్ స్కూల్, కొలంబియా యూనివర్సిటీ, ఎంఐటీ, మసాచుసెట్స్ ఐ అండ్ ఇయర్ సంస్థకు చెందిన పరిశోధకులు తయారుచేశారు. సాధారణంగా ఇప్పుడు వినియోగించే కోక్లియర్ ఇంప్లాంట్ పరికరాలను చెవి లోపల అమర్చినప్పటికీ, బయట అమర్చే మరో పరికరం ఆధారంగా పని చేస్తుంది. పడుకునేటప్పుడు, వ్యాయామం చేస్తున్నప్పుడు దీనిని వినియోగించడం కష్టంగా ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారంగా తమ అంబోమైక్ సెన్సార్‌ను తయారుచేశామని, దీనిని చెవి మధ్య భాగంలో అమర్చాల్సి ఉంటుంది. బియ్యం గింజ అంత సైజులోనే ఉంటుందని, ఒకసారి అమర్చితే పదేండ్ల పాటు వినియోగించవచ్చు.

పాస్‌వర్డ్‌లపై అశ్రద్ధ

దేశంలో సగం మందిది ఇదే వరస



ముంబై, జూలై 3: ఆర్థిక లావాదేవీలకైనా.. వ్యక్తిగత సమాచారం గోప్యతకైనా.. పాస్‌వర్డ్‌లే చాలా కీలకం. అయినప్పటికీ ఈ పాస్‌వర్డ్‌ల విషయంలో దేశంలోని సగం మంది వైఖరి నిర్లక్ష్యంగానే ఉంటుండటం ఇప్పుడు ఆందోళనకరంగా మారింది. తాజాగా వచ్చిన ఓ సర్వేలో మెజారిటీ భారతీయులు తమ పాస్‌వర్డ్‌లను అజాగ్రత్తగా ఉంచుకుంటున్నారని, ఇతరులతో పంచుకుంటున్నారని తేలింది. ఏటీఎంలు, డెబిట్ లేదా క్రెడిట్ కార్డులపాస్‌వర్డ్‌ల విషయంలో దాదాపు 17 శాతం మంది అశ్రద్ధ వహిస్తున్నారని లోకల్‌సర్కిల్స్ అధ్యయనంలో స్పష్టమైంది. మొబైల్ ఫోన్ డాటా, కాంటాక్ట్ లిస్ట్ అంశాల్లోనూ నిర్లక్ష్యంగా ఉంటున్నారు. 34 శాతం తమ పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచుకుంటున్నారు.

సోడా, ప్యాకేజ్డ్ జ్యూస్ తయారీలో

వాటిని వాడొద్దు

రంగు, రుచి కోసం వాడే అడిటివ్స్‌పై అమెరికా నిషేధం

న్యూయార్క్, జూలై 3: రంగు, రుచి, నిల్వ సామర్థ్యాన్ని పెంచే రసాయనాల్ని సోడా, ఎనర్జీ డ్రింక్స్, ప్యాకేజ్డ్ జ్యూస్‌లలో వాడటాన్ని అమెరికా నిషేధించింది. వీటితో గుండెపోటు, జ్ఞాపకశక్తి కోల్పోవటం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆ దేశంలోని 'ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్' (ఎఫ్‌డీఏ) పేర్కొన్నది. ఆహార పదార్థాల తయారీలో వాడే 'ఫుడ్ అడిటివ్స్' ఆరోగ్యానికి హాని చేస్తాయని ఇందులో హెచ్చరించింది. ఫుడ్ అడిటివ్స్‌గా వాడే 'బ్రోమినేటెడ్ వెజిటబుల్ ఆయిల్' ఆరోగ్యానికి ఎంత ప్రమాదకరమో ఉదహరించింది. తాజాగా విడుదల చేసిన ఉత్తర్వులు ఆగస్టు 2 నుంచి అమల్లోకి వస్తాయని ఎఫ్‌డీఏ పేర్కొన్నది. 'ఫుడ్ అడిటివ్స్'పై ప్రస్తుత శాస్త్ర పరిశోధనల్లో ఆందోళనకర విషయాలు బయటపడ్డాయని ఎఫ్‌డీఏ డిప్యూటీ కమిషనర్ చెప్పారు.

చీమలు కూడా సర్జన్లే!

- గాయపడిన తోటి చీమకు వైద్యసాయం
- మనిషి తర్వాత రెండో సర్జన్‌గా గుర్తింపు
- జర్మనీ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): చీమలు కష్ట జీవులని తెలుసు. అయితే, గాయాలపాలైన వారికి మనుషుల్లా సాయం చేయడమే కాదు గాయాలను మాన్పించే డాక్టర్లుగా, సర్జన్లుగానూ చీమలు పనిచేస్తాయని తెలుసా? ఇది నిజం. గాయాలపాలైన చీమను రక్షించడానికి తోటి చీమలు డాక్టర్లుగా మారి వైద్యసాయం అందిస్తాయని జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ వుర్జ్‌బర్గ్ శాస్త్రవేత్తలు చేసిన తాజా పరిశోధనలో తేలింది. మందులు, వైద్య పరికరాల అవసరం లేకుండానే శస్త్రచికిత్సలను చేసి చీమలు సర్జన్లుగానూ మారుతాయని వెల్లడైంది.

పరిశోధన ఇలా..
ఏదైనా చీమ గాయపడితే.. తోటి చీమలు వెంటనే ఆ గాయపడిన చీమ చుట్టూ చేరుకొని దాన్ని పుట్టలోకి తీసుకెళ్తాయని ఇదివరకు జరిగిన పరిశోధనల్లో తేలింది. అయితే, పుట్టలో ఆ తోటి చీమలు ఏంచేస్తాయన్న విషయంపై మైక్రో కెమెరాల సాయంతో యూనివర్సిటీ ఆఫ్ వుర్జ్‌బర్గ్ శాస్త్రవేత్తలు లోతుగా పరిశోధనలు చేశారు. దీనికోసం ఓ ఫ్లోరిడా కార్పెంటర్ చీమ కుడి తొడ కిందిభాగంలో ఉద్దేశపూర్వకంగా కోత పెట్టారు. ఇది జరగ్గానే, ఆ గాయపడిన చీమ చుట్టూ దాదాపు 13-17 చీమలు చేరుకొన్నాయి. ఆ తర్వాత ఆ గాయపడిన చీమను దగ్గర్లోని పుట్టలోకి తీసుకెళ్లాయి. రక్తస్రావం కాకుండా నోటిలోని లాలాజలంతో ఆ గాయాన్ని అదే పనిగా తడమడం చేశాయి. ఆ తర్వాత, గాయం ఇన్ఫెక్షన్ అయ్యే ప్రమాదం ఉందని గ్రహించి తొడ కిందిభాగాన్ని శరీరం నుంచి వేరు చేశాయి. దీనికోసం గాయపడ్డ చీమ తొడను తోటి చీమలు అదే పనిగా కొరికినట్టు పరిశోధకులు తెలిపారు. శరీరం నుంచి ఆ భాగం వేరుపడగానే, మళ్లీ లాలాజలం సాయంతో రక్తస్రావాన్ని నివారించినట్టు పేర్కొన్నారు. ఈ ప్రక్రియనంతా కేవలం 40 నిమిషాల్లోనే పూర్తి చేసినట్టు వెల్లడించారు. కాసేపటి తర్వాత ఆ గాయపడిన చీమ సాధారణ స్థితికి చేరుకొన్నదని, దానికి ప్రాణాపాయం తప్పిందని వివరించారు. ఈ వివరాలు 'కరెంట్ బయాలజీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఆ రికార్డు చీమకే!
భూమిమీద మనిషి తర్వాత సర్జరీ చేసే రెండో జీవిగా చీమను గుర్తిస్తున్నట్టు పరిశోధనలకు నేతృత్వంవహించిన శాస్త్రవేత్త ఎరిక్ ఫ్రాంక్ తెలిపారు.

మానవ మెదడు కణాలతో

నియంత్రించే రోబో

ఏఐ కంటే తెలివైనది..

చైనా శాస్త్రవేత్తల అభివృద్ధి

బీజింగ్, జూలై 3: మానవ మేధస్సుతో కృత్రిమ మేధ(ఏఐ) పోటీ పడగలదా అనే చర్చలు జరుగుతున్న వేళ చైనాకు చెందిన శాస్త్రవేత్తలు జీవశాస్త్రానికి సాంకేతికతను జోడించి సరికొత్త సంచలనానికి తెర తీశారు. తైన్‌జిన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు మానవ మెదడు కణాలను ఉపయోగించి ఒక హ్యూమనాయిడ్ రోబోను తయారుచేశారు. మూల కణాలతో ఈ హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేశారు. ఈ కణాలను ఎలెక్ట్రోడ్ ద్వారా కంప్యూటర్ చిప్‌కు అనుసంధానం చేశారు. దీనికి సమాచారాన్ని ఎన్‌కోడ్, డీకోడ్ చేయగల సామర్థ్యం ఉంటుంది. సాధారణ రోబోలు ముందుగా ఇచ్చిన ప్రోగ్రామ్ ప్రకారమే పని చేస్తాయని, ఈ హ్యూమనాయిడ్ రోబో మాత్రం కొత్త విషయాలు నేర్చుకోగలదని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. భవిష్యత్తులో ఇవి మనుషులకు వైద్య చికిత్స అందించడంలో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు.



ఆత్మహత్య చేసుకున్న రోబో!

దక్షిణ కొరియాలో ఘటన

సియోల్, జూలై 3: దక్షిణ కొరియాలో ఆశ్చర్యపరిచే సంఘటన చోటు చేసుకుంది. ఇక్కడి గుమి నగర కౌన్సిల్ కార్యాలయంలో సేవలందించే ఒక రోబో.. కౌన్సిల్ భవనం మెట్లదారిపై ధ్వంసమై పడిపోయింది. అయితే, రోబో ఆత్మహత్య చేసుకుందనే ప్రచారం జరుగుతున్నది. రోబో దానికదే మెట్లపై నుంచి కింద పడిందని, ఇందుకు కారణాలు తెలియాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు. దీంతో దక్షిణ కొరియా వాసులు రోబో ఆత్మహత్య చేసుకుందని చెప్తూ సోషల్ మీడియాలో విచారం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ఘటనకు ముందు రోబో.. ఏదో వెతుకుతున్నట్టుగా అటూఇటూ తిరుగుతున్నదని ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. ఈ ఘటనపై విచారణ జరుపుతామని, ముక్కలైన రోబో భాగాలను దానిని తయారుచేసిన కంపెనీకి పంపిస్తామని అధికారులు తెలిపారు. దక్షిణ కొరియాలో రోబోలను విరివిగా వాడుతుంటారు. కాలిఫోర్నియాకు చెందిన ఓ కంపెనీ తయారుచేసిన ఈ రోబోను 2023 అక్టోబరు నుంచి గుమి నగర కౌన్సిల్‌లో వినియోగిస్తున్నారు. అధికారులకు డాక్యుమెంట్లు అందించడం, ప్రజలకు సమాచారం ఇవ్వడం వంటి పనులు చేసేది. కాగా, గతంలో వాషింగ్టన్‌లోనూ ఒక ఫౌంటెయిన్ వద్ద ఇదే రకంగా రోబో ధ్వంసమైంది. అప్పుడు కూడా రోబో ఆత్మహత్య చేసుకుందనే ప్రచారం జరిగింది. అయితే, అది జారిపడి ధ్వంసమైందని తర్వాత విచారణలో వెల్లడైంది.